# ధర్మసాధని

[బ్రహ్మసాధనాశ్రమ పక్షమున ప్రతిశనివారము ప్రకటింపబడును.]

ధర్మంచర । ధర్మాత్ పరం నాస్తి । ధర్మః సర్వేషాం భూతానాంమధు.

సంపుటము ౧. | 19 1921 కాకినాడ:—శనివారము, నవంబరు, ౧౯, ౧౯౨౧. | చందా సం॥ రు ౩.

సంచిక ౪౭. | విడిసంచిక అ ౧.

ఓమ్.

అనంత దేవుడవు అక్షర బ్రహ్మమవు
సదసత్తులకు పరుడవగు చుండియును గూడ
జగముల నిండియు నాది దేవుడ వగుచు
పురాణ పురుషుడై ప్రపంచముల కెల్ల
పరమ నిధానమై వేద్యమౌ వస్తువై
పరమ ధాముండవై విశ్వ వ్యాపుండవై
అనంత రూపముల నగ్నియమ వాయువుల
శశాంక వరుణాది బ్రహ్మ రూపంబులను
బాగుగా దాలిచి ప్రపితా మహుండవై
నెల్లొందు దేవునకు వేయి విధంబులను
అనంత వీర్యమును నతి పరాక్రమంబును
గలిగియు నంతట నిండి యుండిన నీదు
సర్వ స్వరూపముల సద్భక్తితో నేను
ముందంతటను వెనుకను నన్ని దిశలందును
నమస్కృతులను సల్పి నే సంతసించుచును
అచ్యుతుడవై నట్టి నీ మహిమ నే నెరుగ
నేరకను నను మిగుల అజ్ఞానమున గాని
చనవు చేతను గాని సఖుడవని యెంచుచు
నిర్లక్ష్య భావమున హే నాధ! హే సఖా!
హే దీనబంధో హే దయాసాగరా!
హే భక్తవత్సలా! యనుచు నిన్ బిలచుచు
సఖ్యభావంబునన్ విహార శయ్యాసన
భోజన వేళలన్ ఒంటరి పాటునన్
ఇతర సమయంబులన్ అందరును నున్నపుడు
పరిహాసమున నేను చుల్కనగ జూచుచును
మక్కువతో జేసుచును మహిమలను దెలియక నె
నొనరిచినట్టి నా యపరాధముల నైచి
నన్ను క్షమింపుమని యప్రమేయుడ వైన
నిన్ను నే వేడుచు నిఖిల చరాచర
జగములకు పితవును పరమ పూజ్యుడవును
గురువును శ్రేష్ఠుడవు నగుచుండు నీకు
నీలోకత్రయమున సరి సమానులు లేరు
నీకంటె నధికులు మఱియొక్క రుందురా?
పుత్రుని దండ్రియు, చెలికాని చెలికాడు,
ప్రియురాలినిన్ ప్రియుడు నెటుల మన్నింతురో
ఆ రీతి నీవు నా తప్పులను క్షమియింప
తగిన వాడనుచును తప్పక నినుజేరి
సాష్టాంగ మొనరించి ప్రార్థనా పరుడనై మయినట్టి
నీక్షమాగుణమునున్ నీ దయాళుత్వమున్
నిరతంబు మదినెంచి నిన్ను ప్రార్థించెదన్.

Bhagavadgita XI. (37-44.)

ఇ. సు. కృ.

---

దాసుడా, నా కొరకై నీ వెచ్చట వెదుకు చున్నావు. చూడుము, నేను నీ చెంతనే యున్నాను. నేను దేవాలయములో లేను, మసీదులో లేను, నేను కాబాలో లేను, కైలాసములో లేను, నేను కర్మకలాపములో లేను, యోగ వైరాగ్యములందును లేను, నిజముగా నన్ను నీవు కోరుచో ఒక్క క్షణములో చూడగలవు. దేవుడు ప్రాణమునకు ప్రాణమని కబీరు నుడువు చున్నాడు.

పా. స.

---

# సహనము.

—:o:—

కొన్ని సమయములందు మానవుల కింద్రియోద్రేకము గలుగును. ఆయుద్రేకము చెడ్డది. ఇంద్రియ ప్రచలనము చెట్ట దెచ్చిపెట్టును. మన యింద్రియములను మితస్థితియందుంచి మన యంగకములందు తీవ్రవ్యాపారములు జరుగకుండునట్లు కనిపెట్టియుండవలెను. అమితత్వము మనకు రోగకారణి కదా! మితత్వము వలని లాభము లనేకములు.

మృత్యుదేవత సభామందిరము బ్రవేశించి తన సఖీజనుల గాంచి రోగకారకు డెవడని ప్రశ్నించె. జ్వరరాజు ముందరికి వచ్చి తన వలన రోగము లనేకములు కలుగుచున్నవనియెను. అమితత్వరాజు పైకి లేచి జ్వరము మొదలగు రోగములకు గూడ దానే కారణభూతుడని చెప్పెను. అంతట మృత్యుదేవత నిలువబడి వానిని మిక్కిలి సమ్మానించి తన యమితత్వ ప్రభావము వలన మరణములం దెచ్చుచున్నాడని వానికి మంత్రిపదవి నొసగెను.

అమితత్వము నభిలషించువా రెవరుండరు? మన యింద్రియములు పోయిన దారిన బోక వాని నణంచుటకు బ్రయత్నపడవలెను. ఈనిగ్రహమునకు సహనమని పేరు.

ఇంద్రియప్రచలనము వలన పుట్టు గుణములు కామము క్రోధము మదము మొదలగునవి. ఈ గుణములలో నెద్ది యుండినను దప్పక చెఱుపు కలుగును. ఒక్కొక దానిని పోగొట్టుకొనుటకు కృషి సలుపవలెను. ఇంద్రియ ప్రాబల్యముచే మనలో దౌష్ట్యము ప్రబలును. దానికి తావీయకూడదు. ఈ కార్యములన్నియు సహనమున జేరుచున్నవి.

మన జీవితమునందు సుఖములు వలెనే దుఃఖములు సయితము సంప్రాప్తించుచుండును. దుఃఖములు వచ్చెనని వగపరాదు. వ్యాయామము వలన మన కండరములం దొకొక మార్పు గలుగునట్లే కష్టములవలన గూడ వివిధ భేదములు మనయందు గాన్పించుచుండును. ఆ భేదములు మన కత్యవసరములు. కష్టముల నెల్ల సైరించుకొని మన రహస్య జీవితముల నభివృద్ధి జేసికొనవలెను. మైనము కరగి మన పనుల కెల్ల సహాయపడునో యట్లే సహనవృత్తి మన హృదయములను గరిగించి మనలను బనికివచ్చునట్లు చేయును.

కామమును మనము సహించుకొనవలెను. కాముని బారికి జిక్కితిమేని మన మవశ్యముగా చెడిపోదుము. కామము మనుజులను దిక్కుతెలియనివారిగా జేయును. దానికి లోబడక గట్టు దాటినవారు ధన్యాత్ములు. కామోపశమనమునకీ సహనవృత్తి మార్గమగుచున్నది గదా!

ఇంద్రియప్రాబల్యము వలని మఱియొక గుణము క్రోధము. విశ్వామిత్రమహర్షి కిది యుండబట్టి నాశనమొందెను. దీనిని మన మవశ్యము పరిమార్చవలెను.

మద మనునది కూడ నింద్రియప్రాబల్యము వలని మఱియొక దుర్గుణము. మదవతు లెందరో మగల దిరస్కరించి పాడుబడిరి. మనలో నది యుండరాదు.

పై బేర్కొనబడిన దుర్గుణములను జయించి చెడుపోకల బోనివాడు సహనకారుడగుచున్నాడు. సహనకారి తనయందు బలపడియుండును. బయటిశత్రువులు వాని నావరింపవు. అతడగ్నిలో కాలడు. నీటిలో మునుగడు. మాయలో దగుల్కొనడు. వానియం దొక దివ్యశక్తి యుండును. వానికి దుఃఖములందు సుఖము దోచును. కంపునం దింపు గనపడును. లోక మానందమయముగ దోచును.

సహనకారుని హృదయము ఱాతివలె గడుసుగనుండును. వెన్నవలె మెత్తగనుండును. ప్రపంచమునందలి మేలిమి వస్తువుల లోనత డొకడగును. అతనివలన ప్రయోజనములు మెండు. దేశమున కతడు లాభకారి. మానవ సంఘమునకు సహితము లాభకారి.

సహనము మనుజుల కావశ్యకమని తోచెగదా! దానిని ప్రతి యొకడును స్వానుభవమున వాడుకొనుచుండవలెను. వాని యొక్క దైనిక జీవితమున నది తెల్లమగుచుండును. వాని సిద్ధాంతములందెల్ల నదియే గన్పట్టుచుండును. దాని కుదాహరణములు వాడు వెదకుచుండవలెను. ధర్మసముదాయముచే నిర్మింపబడిన మతమునందు వాని కది నిర్మలమగుచుండును. మత సహన మెద్ది?

మతమనునది సంపూర్ణభావములచే కల్పింపబడి లోకమునకు మనకు గల సంబంధ మెఱుకసేయుచుండును. ఈసంబంధ మెఱుగుటయే మత మెఱుగుట యగును. మానవులు మనకు సహోదరులా? వారి దుస్స్థితియందు మనకు క్లేశము జనించునా? హీనుల నుద్ధరింపవలెనను గోర్కె మనకు తట్టుచున్నదా? మొదలగు విషయములన్నియు నీ మతము బోధించుచుండును. ఈమతమే మనకును లోకమునకు బాంధవ్యము గూర్చుచుండునది. ఈమతమునందు సహనవృత్తి నవలంబించుట మతసహన మగుచున్నది.

మతమనున దొక జలాశయమువంటిది. నానాదిక్కుల నుండి వచ్చు జనులు కూడ దాని యందలి నీరము గొందురు. ఒక్కొక మూల నొక్కొక నామము నీటికి గల్గె గాని నీరు మారదయ్యె. మతసారము కూడ యనేక నామములతో బరగినను నొక్క రూపమునే తాల్చియుండును. సహన బుద్ధితో బరికించిన వేర్వేరు మతములలో నీ యభిప్రాయము స్ఫురించును. సత్య పరిశోధనమునకీ సహనము కదా సరపునది!

ఇంద్రియ ప్రకోపము వలన నంధత గల్గుననియు, ఘనత తగ్గుననియు, ఉన్న మంచిని మనము మఱతుమనియు విదితముగ దెలియుచున్న విషయము. కోపి తనకోప మెఱుగకుండునట్లు ద్వేషి తన దోషముల నెఱుగకుండును. సత్య మెందున్నను స్వీకరింపదగినది యగుటచే మనము సహనవృత్తి నవలంబించవలెను. ద్వేష క్రోధములు బ్రబలిన మన దృష్టికి సత్యము లసత్యములుగ గన్పట్టును గాని యనురాగముచే సర్వ సమత మనకు స్ఫురించును.

భూమిమీద నడచునపుడు ఈభూమి మనదనియు నీభూమి వారిదనియు దెలియుచుండు గాని భూమి దాటి శిఖర మెక్కిన భూమి యంతయు నొక్కటనని తోచుచుండును. అట్లే క్రోధము మనయం దుండెనేని వివిధ భేదములు గాన్పించుచుండును. జితక్రోధుల మగుదుమేని మనకు సర్వతోముఖ సమత యేర్పడును. అప్పుడు మన జ్ఞాన మభివృద్ధియగును; సమున్నతజ్ఞాన శిఖరము నధిరోహించియుందుము. జ్ఞానాభిలాషులు సహనకారులై యుండవలెను గదా !

సహనవృత్తిగలవానికి సర్వము ప్రీతికరముగను సహింపదగినదిగను గన్పట్టెను. అతని భావము లనురాగపూరితములయ్యెను. అతని చిత్తము ప్రేమచే వికసించినదయ్యెను. అతని పల్కు లమృతంపు సోనలయ్యెను. అతని మేను దివ్యనిధి యయ్యెను. అతని కగపడినది జగదానందము సృష్టికౌశలము నీశ్వరుని యనంతజ్ఞానమునయ్యెను. అతని హృదయమందు జ్ఞానజ్యోతులు ప్రజ్వలించుచున్నవయ్యెను. అంతయు వాని కింపిదమయ్యె గాని కంపుగొట్టునది లేకపోయినది. దేని గాంచినను వాని కసహ్యము పుట్టదయ్యె. వాని పుట్టువుగదా పుట్టువు !

శారికలు వానికొఱకు వినోదముగా బాడెను. మయూరములు నృత్యము సలిపెను. చిలుకలు పలికెను. తేంట్లు ధ్వనించెను పుష్పములు విరిసి తేనె నిచ్చెను. వనలక్ష్మి వానికొఱకు విహారోద్యానవనముల నొసగెను. చెట్లు కాయలను బ్రసాదించెను. వాడింక కోరినది యన్యమగునది లేదయ్యె. అంతయు వానికి దృష్టికరముగ గోచరించినది. వానికి సంపూర్ణ సహనభావము చేకూరినది. ఆహా ! వాని నెంతను దెచ్చె, సహనవృత్తి ?

సహన బుద్ధిగలవాడు తప్పులను విడిచి యొప్పులను జేకొనును ముండ్లను ద్రోసి బయలునందు నడచును. కల్లును విడిచి తేనెను గ్రోలును. జాతి విడిచి నీతినెంచును. భేదము విసర్జించి యభేదవృత్తిని బూనుకొనును. గడ్డిని విడిచి యన్నమును దినును. ఇష్టపడిన కూడ గడ్డి తినడు. ఇంద్రియములు వానికి వశములయినవి. బుద్ధిపోయిన బోకలబోడు. వివేచన మతనికి గలదు. సహన బుద్ధి కలదు. పొరపాటుచే కసవు దిన్న ప్రయోజన మబ్బదని గ్రహించు శక్తి వానికున్నది. అబ్బా ! వాడే సర్వకర్మ పరాక్రమవంతుడయ్యెను. ధీరోదారుడయ్యెను. ధరాతలము వానికి లోబడినదయ్యెను. మొనగాడనిన వాడే మొనగాడు !

సహనబుద్ధి సాధారణముగా వానికి గలిగినది కాదు. వాడు చాల కష్టపడెను. బాగోగులను విచారించెను. కారణాకారణ శక్తి నభివృద్ధి పఱచుకొనెను. సకలకార్యములం దత డాత్మప్రబోధితుడు కాజొచ్చెను. వాని యాత్మశక్తి రానురాను విజృంభించినది. అధికార ప్రాబల్యముచే నత డెట్టి నిరంకుశాధికారము నొప్పికొనడు. వానియం దద్భుతశక్తి యిమిడెను. ఆశక్తి వానిలో నణగియుండక రానురాను నిఖిల భూతములయందు పర్వజొచ్చెను. సహనకారి యన్న వాడే సహనకారి !

ఇక చరిత్రాంశములకు బోయి లోకవ్యాపారములందు సహనవృత్తి చేసిన పనిని విపులముగా చర్చింపవలెను. భూత భవిష్యద్వర్తమానములం దిది యున్నతస్థాన మాక్రమించి యుండును. తెలివి కొలది యొక డొకడు దీనిని గ్రహింపవలెను.

పూర్వకాలమున దింగ్లాండు దేశమునందు మత విరోధములు ప్రబలి యుండెను. క్యాతోలిక్కులు ప్రాటెస్టెంట్లతో నేకీభవింపక లేనిపోని జగడములు దెచ్చికొనిరి. రాజులు పదచ్యుతులైరి. ప్రజలు భీతిపడిరి. శాంతి యుండినచో నెట్టి సుఖము గలిగియుండును ? ప్రజలు తమ మతములను సమదృష్టితో బరికించియుండిన నెట్టి సత్యములు బయల్పడియుండును ? ప్రయోజనము లేకయే యట్టి ద్వేషాదులు ప్రబలియుండినవి. ఏదేశమైన గాని సహనభావము గల్గి సమదృష్టితో సర్వస్వమును బరికింప కుండినచో నిక్కముగా నంతమొందెను.

హిందూదేశమునందు ఔరంగజేబు మహమ్మదీయ మతమున హిందువులను జేరుమని యెట్లు బాధపెట్టెను ? మత ద్వేషముచే నల్లాయుద్దీను టోగ్లాకులు జనుల నెట్టిహింసల బాలుచేసిరి ? ఇట్లు చేసియు వారేమైన గట్టికొనిపోయిరా ? వీరందఱివలె గాక యాక్బరు సహన బుద్ధి గలిగి హిందూ మహమ్మదీయుల సమదృష్టి జూచి యెట్లు ప్రజల మెప్పు వడసెను ?

సహనబుద్ధి గలిగిన రాజులు ప్రేమింపబడుదురు; రాజ్యములు వర్ధిల్లును; శాంతి ప్రబలును; వేయేల ? సర్వము సహింపదగినది యగును. లోకమునం దెచ్చటనైన నింతే.

సుఖపడుటకు మార్గము సహనము. నీతుల కది దారితీయును. జ్ఞానమున కది త్రోవజూపును. సహనము గల్గి సర్వులు వర్ధిల్లుదురు గాక !

వే. వెం.

---

## విజ్ఞాన చంద్రికా పరిషత్పరీక్షా ఫలితములు.

ఈ పరీక్షలో ౧౯౨౦ వ సం॥ నందు మొదటి తరగతిలో నెవ్వరును జయము పొందలేదు. రెండవ తరగతిలో ఉ కృతార్థులైరి.

౧. ఆట్లూరి వెంకట సీతమ్మ, అంగలూరు: విజ్ఞానచంద్రికా మండలివారి యుత్తమ బహుమానము. రూ ౧౧౬ లు.

(మిగతా బహుమతులలో కొన్ని యీమె యిదివరకు పొంది యున్నారు.)

౨. కూరాడ జగన్నాధరావు, బర్హాంపురము: శ్రీ ఉయ్యూరు జమీందారు గారి ౧ వ బంగారు పతకము.

3. పెరాట్ల సత్యనారాయణ శర్మ, కాకినాడ: శ్రీ ఉయ్యూరు జమీందారు గారి ౨ వ బంగారు పతకము.

౪. పురేప్రు సూర్యనారాయణమూర్తి, రాజమండ్రి: శ్రీ ఉయ్యూరు జమీందారు గారి 3 వ బంగారు పతకము.

౫. తుంపతి సంజీవరావు, పెనుకొండ: రావిచెట్టు రంగారాయ బంగారు పతకము.

౬. కాసూరి వెంకట నరసింగరావు, విజయనగరము.

ఆ. లక్ష్మీపతి, మానేజరు.

---

సత్యమేవ జయతే

# ధర్మసాధని

శనివారము, నవంబరు, ౧౯, ౧౯౨౧.

## ఈశ్వరవాణి.

---:o:---

పరమేశ్వరుడు విశ్వమునం దంతటను శాసనముల నేర్పరచి యమోఘములయి చెల్లుబడి యగునట్లు చేసెను. ఆకాశమునందలి లెక్కలేని గోళములు ఈశ్వరశాసన మనుసరించి జవదాటక తమ గతులందు సంచరించుచున్నవి. అతి భయంకరముగ దోచు అపార పారావారము ఈశ్వరుడు నియమించిన హద్దును మీరి చరింపదు. ఈశ్వరాజ్ఞానుసారము వాయువు వీచును, అగ్ని వెలుగును, జలము ప్రవహించును, భూమి భరించును. ఈశ్వరుడు నిర్ణయించి నటుల రాత్రులు, పగళ్లు ఏర్పడును, ఋతువులు జరగును. పశు పక్ష్యాదులెల్ల సృష్టికర్త యొక్క నియమముల పాలించుచున్నవి. జడ జగత్తునందేమి, జంతు జగత్తునందేమి, ఎచ్చట గాంచినను, శాసనోల్లంఘనము గాన్పింపదు

కాని మానవులలో శాసనాతిక్రమణమునకు గడంగు వారు గలరు. శాసనోల్లంఘనము మానవులందు ప్రశంసింపబడుచున్నది. అవి పూర్తిగ నిర్వర్తించి కీర్తిగాంచిన వారెందరో యున్నారు. బుద్ధుడు, జీసస్, మహమ్మదు, ప్రతి సంస్కర్తయు శాసన ధిక్కారము సలిపిన వారే. జడపదార్థములు, జంతు సంతానము శాసనముల నక్షరమాత్రమైన మీరక యనుసరించుచుండ, మానవులు మాత్రము శాసనము లుల్లంఘించుటకు సృజింపబడిరా? ఈశ్వరుడు మనుష్యులకు ప్రభువు కాడా? శాసన నిరసనము వారికి చెల్లునా? శాసనముల తిరస్కరించి వారు సుఖము బడయుదురా? ఈ విషయములను గూర్చి యోచించుకొని కర్తవ్యము నిశ్చయించుకొనుట ప్రతి మనుష్యుని ముఖ్య విధి.

ప్రథమమున నొక విషయము గమనింప వలసి యున్నది. శాసనము తిరస్కరించిన ప్రతి మనుజుడు జనుల మెప్పునకు పాత్రుడగుట లేదు. సంఘమునందలి నియమముల దాటి చరించుట వలన దోషులుగ, పాపులుగ పరిగణింపబడి స్తోత్రమునకు బదులు నిందలకు, శిక్షలకు పాలుసేయబడు వారు కోటాను కోట్లు గలరు. తల్లిదండ్రుల మాట త్రోసిపుచ్చు పుత్రులు, గురువుల యాజ్ఞ పాటింపని శిష్యులు, సంఘాచారముల పరిగణింపని వ్యక్తులు, రాజ శాసనముల మన్నింపని జనులు నికృష్టులుగ, హీనులుగ సంఘముచే సాధారణముగ నెంచబడు చున్నారు. వారట్టి ఘనత బడయుట లేదు. వారెల్లరకి శాసనానుసరణము విధియని బోధింపబడు చున్నది. సర్వేశ్వరుని ఆజ్ఞలె తల్లిదండ్రులు, గురువులు, నాయకులు, పాలకులు మున్నగు వారి ద్వారమున వెలువడుటచే సర్వజనులచే నవి శిరసావహింపబడుటలో నాశ్చర్య మేమి గలదు? శాసనములకు లోబడి యుండుటయె ప్రతి మనుష్యునకు సామాన్య ధర్మము.

కాని మానవుడు దోషరహితుడు కాడు. భ్రమ ప్రమాదాదులు వానికి గలవు. ఎట్టి ధీమంతుడైనను, ఒకొక్కప్పుడు భ్రమ జెందవచ్చును. సత్యము అసత్యమని, అసత్యము సత్యమని, భ్రమింప వచ్చును. తల్లిదండ్రులు, గురువులు, నాయకులు, పాలకులు, ఎంత యనుభవజ్ఞులయినను కొన్ని దోషములు కలిగి యుండవచ్చును ఆ దోషములు వారి యనుచరులకు విధింపబడును. సామాన్యముగ నవియు అందరిచే విధి కృత్యములుగ నిర్వర్తింపబడును. ఈశ్వరుడు ప్రతి మానవ హృదయమునం దాసీనుడై సత్యాసత్యముల వ్యక్తపరచుచున్నాడు. ప్రతి ఆత్మయందు ఈశ్వరవాణి పలుకగలదు. కాని ఆ ధర్మనాదము విస్పష్టత గాంచనంతవరకు ధర్మరూపమున వెలువడదు. బాహ్య ప్రబోధమునను ప్రతి ఆత్మయు సహజముగ లోబడును. ఒక తీగెమీద చేయబడు నాదము మరియొక తీగెమీద దానంతటదియె పలుకును. ఒక హృదయము నందలి ధర్మనాదము మరియొక హృదయములోను ప్రతిధ్వనించును. శుశ్రూష, అనుసరణము వలని ఫలమిదియె. కాలక్రమమున ప్రతి ఆత్మయు స్వయం నియంతృత్వము వహించి తానె ధర్మనియా

షణము గావింప నేర్చును. అట్టి ప్రబుద్ధాత్మ ఏ శాసనమును పాటించినను, స్వయముగ దాని సత్యమును తెలిసికొనియె యనుసరించును. అది ఏ శాసనములందు దోష ముండుట గాంచెనో ఆ శాసనములనె అతిక్రమించును. ఈశ్వర వాణిని తమ హృదయములందు విను వారికె శాసనోల్లంఘనమునకు అధికారము కలదు. తదితరులకు తమ శ్రేయమార్గము వారలను భక్తి పూర్వకముగా మన్నించి మారు మాటాడక యనుసరించుట విధాయకము.

## క్రైస్తవ మతబోధ— విద్యాలయములు.

క్రైస్తవులు తమ మతమునందు సత్యము కలదని, తమ మతకర్త ఆదర్శ పురుషుడని నమ్మి తమ మత వ్యాపనమునకు అనేక విధముల పాటుపడు చున్నారు. వారు పాటుపడు మార్గములలో నెల్ల ప్రశస్తమని చెప్పదగినది విద్యాలయముల స్థాపించి తన్మూలమున మతబోధ గావించుట. విద్యాలయములందు పట్ట పరీక్షలకు విద్యార్థులు సన్నద్ధులు చేయబడుదురు. విద్యార్థులు జ్ఞానమునందు పెరుగుచు యుక్తాయుక్త విచక్షణా సమర్థత బడయుదురు. అట్టి వారికి క్రైస్తవ మతము నొక ప్రక్కన బోధింపబడు నప్పుడు ఏమి నష్ట ముండగలదు? ఎవరు ఏమి చెప్పినను వినుట మంచిదే గదా? విన్నంతనె వేగిరపడక సత్యాసత్యములు విచారించుట మాత్రము మనము అభిలషింప వలసినది. క్రైస్తవ విద్యాలయము లందలి వారు పామరులు గారు; జ్ఞాన శిక్షణము పొందు విద్యార్థులు. వారికే ప్రలోభనములు, నిర్బంధములు కల్పింపబడని యెడల, వారు సరిగనె వర్తింతురని నమ్మవచ్చును. క్రైస్తవ విద్యాలయముల ద్వారా ఎందరు క్రైస్తవ సంఘమున జేరో వ్రేళ్లపై లెక్కింపవచ్చును. కాని యందలి మతబోధ విద్యార్థుల దృష్టిని విశాలపరచి క్రైస్తవ ధర్మమునందలి విశేషత్వమును మాత్రము గ్రహించునట్లు చేసెను. ఆ మతబోధ యందలి లోపములు ఎత్తి చూపుటలో విద్యార్థులను మించు వారెవరు నుండరు. కావున క్రైస్తవ విద్యాలయముల మూలమున దేశమునకు లాభము కలిగినదనియె మా యభిప్రాయము. క్రైస్తవ మత బోధకులు ఎంత సంకుచితముగ క్రైస్తవ ధర్మమును ప్రకృతము బోధించుచున్నను, వారి బోధయందు మహద్ధర్మ మిమిడియుండి అదియె దేశ దేశాంతరములకు వ్యాపించుచున్నది. బోధకులు సహితము కాలక్రమమున తమ సంకీర్ణత్వము వీడుచున్నారు. హిందువులకు, మహమ్మదీయులకు వలె క్రైస్తవులకును విద్యాలయములందు మతబోధ గావించుకొను స్వాతంత్ర్య మిచ్చుటలో దొరతనము వారు చేసిన దోషము మాకు కాన్పింపదు. క్రైస్తవ పాఠశాలలోనె చదువవలెనని ఎవరికిని నిర్బంధము లేదు. అచ్చటనైన బలవంతముగ ఎవరు మతములో కలుపుకొన బడరు. దేశీయులిచ్చు సొమ్మునుండి ఆ పాఠశాలలకు గ్రాంటు లివ్వబడిన చింతిల్ల పనిలేదు. మత స్వాతంత్ర్య మనుచు, క్రైస్తవ పాఠశాలాధికారులకు గ్రాంటు లివ్వగూడదని కొంతకాలము నుండి ఆందోళన జరుగుచున్నది. మొన్న సి. వి. వెంకట రమణయ్యగారు చెన్నపురి శాసన సభలో గ్రాంటులు ఆపివేయ బడవలెనని తీర్మానము ప్రవేశపెట్టిరి. కాని విజయము నొందలేదు. ఇక నిట్టి ప్రయత్నములు చేయకుండుటయె యుచితమని తలంచుచున్నాము. భారతీయులు నిజముగ సహనశీలురె యయిన యెడల, అన్ని మతముల వారికి న్యాయమయిన మార్గముల తమ దేశమున మతబోధ గావించుకొనుటకు తప్పక అవకాశములు కలిగింప వలయును. ధర్మము ఎవరు బోధించినను ఒకటియె. కాని అది హిందూ దేశమున ఒక ప్రత్యేకాకారముతో మాత్రమె వర్ధిల్లగలదు. ఆ సంగతి క్రైస్తవులు గూడ గ్రహించుచున్నారు.

## అస్పృశ్యత నివారణ మహాసభ.

ఈ సభ కొరకు పంపబడిన యాహ్వాన మీక్రింద పొందు పరచుచు సభకు జయము గోరుచున్నాము:

అంటరాని తనము పోనిదే స్వరాజ్య ప్రాప్తికి మనము అర్హులము గాము గనుక ఈ పిశాచమును పారదోలుటకు తగు విధముల చర్చించి తీర్మానించుటకు ఈ నెల ౨౨ తారీఖున తృతీయ ఆంధ్రరాష్ట్ర ఆదిమాంధ్ర మహా సభయును ౨౩ వ తారీఖున ద్వితీయ అస్పృశ్యత నివారణ మహాసభయును గుంటూ

రులో జరగును. ఆంధ్రదేశ ప్రజలెల్లరు వచ్చి ఈ సభలను జయప్రదముగా జరిపింతు రని ప్రార్థించుచున్నాము.

గ్రామసంఘ కార్యదర్శులు, ఉద్యమాభిమానులు తమ తమ గ్రామములలోని ఆదిమాంధ్ర (పంచమ) సోదరులను ప్రోత్సాహ పరచి సభకు తీసుకొనిరా ప్రార్థితులు.

పంచములకు భోజనవసతులు ఉచితముగనే ఏర్పాటు చేయబడును.

| | |
|---|---|
| నూతక్కి వెంకటేశ్వర్లు,<br>ఆదిమాంధ్ర<br>ఆహ్వాన సంఘాధ్యక్షుడు.<br>పెనుమాక సోమయ్య,<br>కార్యదర్శి. | పోలిశెట్టి హనుమయ్యగుప్త,<br>అస్పృశ్యత నివారణ<br>ఆహ్వాన సంఘాధ్యక్షుడు.<br>నల్లపాటి హనుమంతరావు,<br>కార్యదర్శి. |

ప్రొఫెసరు సిల్వేను లెవీగారు:—

వీరు బోల్పూరు నందలి రవీంద్రుని విశ్వవిద్యాలయమున ప్రాచీన గ్రంథ పరిశోధనము బోధించుటకు ఫ్రాన్సు దేశమునుండి వత్తురని యిదివరకు తెలిపియుంటిమి, కలకత్తా చేరిరి. బోల్పూరు వెళ్ళుచున్నారు. ఈ సుప్రసిద్ధ పండితుని రాక భారతీయులకు ఆనంద దాయకముగ నుండు ననుటకు సందియము లేదు.

జే. సి. బోసుగారి పరిశోధ నాలయము:—

జగద్విఖ్యాత పండితులు జే. సి. బోసుగారు ప్రకృతి శాస్త్ర సంబంధములయిన పరిశోధనలు గావించుటకు డార్జిలింగులో మాయాపురియను భాగమున కొంతకాలమునుండి మహా భవనములు నిర్మించుచున్నారు. అవి యిప్పటికి పూర్తి యయినవి. జే. సి. బోసుగారు కొన్ని క్రొత్త యంత్రముల కనిపెట్టిరి. అవి యన్నియు నచ్చట అమర్పబడెను. నూతన విషయములు కొన్ని వారు తమ యంత్ర సాహాయ్యమున కనుగొని ప్రకటించి ప్రపంచములోని శాస్త్రజ్ఞులెల్లర అచ్చెరువొంద జేసిరి. జంతువులకు వలె, వృక్షలతాదులకును సుఖదుఃఖానుభవము కలదనునది వారు ఋజువు చేసిన మహద్విషయములలో నొకటి. ఇతర దేశస్థులు కూడ వచ్చి బోసుగారి పరిశోధ నాలయమున విద్యార్థులుగ నున్నారు. పాశ్చాత్యులకు ప్రకృతి శాస్త్రాదులలో విశేష ప్రజ్ఞ కలదు. వారిని మించిన మహనీయుడు జే. సి. బోసు భరతవర్షమున జన్మించి యుండు గురుపీఠము స్థాపించెను. బోసుగారికి ఈశ్వరుడు చిరాయురారోగ్యములు ప్రసాదించును గాక !

# బ్రాహ్మ సమాజము.

———:o:———

కాకినాడ బ్రాహ్మసమాజము.

13-11-21 ఆదివారము సాయంకాలము ఆరు గంటలకు బ్రాహ్మసమాజ మందిరమున బ్రహ్మోపాసన యుత్సాహముతో జరిగెను. శ్రీయుత గూడపాటి సత్యనారాయణగారు యుపాసన జరిపిరి. పలువురు సభ్యులు సమావేశ మయిరి. తిరిగి 15-11-21 పౌర్ణమి మంగళవారము రాత్రి సుమారు ఏడున్నర గంటలు మొదలు పదిగంటల వరకు సమాజ మందిరమున అత్యుత్సాహముతో భజన జరిగెను. సమాజ మందిరమునకు సభ్యులు ప్రేక్షకులు దయచేసి భజన భక్తి పూర్వకముగా జరిపిరి. 20-11-21 ఆదివారము సమాజ మందిరమున యథా ప్రకారము ఉపాసన జరుపబడును. శ్రీయుత వి. పెదంబరాజుగారు ప్రార్థన సలిపెదరు. సభ్యులు, సమాజమందు అభిమానము గల అందరు దయచేయ ప్రార్థితులు.

వాడ్రేవు రామమూర్తి.

మహాత్మ గాంధి జన్మోత్సవము:—

కలకత్తాలో నవ విధాన బ్రాహ్మసమాజ ప్రచారాశ్రమమున భాయి ప్రమోతలాల్ సేనుగారి ప్రోత్సాహమున మహాత్మ గాంధి జన్మోత్సవము గత సెప్టెంబరు ౩౦ వ తేదిని జయప్రదముగా జరుపబడెను. చాలమంది యువకులు ఉత్సవమున పాల్గొనిరి. ‹భక్తప్రదర్శనేర్ భార్ నవవిధానేర్’ అని కేశవచంద్రుడు చెప్పిన వాక్యము నాటి యుత్సవమునందు సార్థకత గాంచినదని వరల్డు అండ్ న్యూ డిస్పెన్సేషన్ పత్రిక ఆనందించుచున్నది.

**The Dharma Sadhani Press,**

COCANADA.

***All Kinds of Job work***
***in***
**English & Telugu**
***Promptly and Neatly***
***executed.***

# ధర్మసాధని.

ప్రకటన పద్ధతి.

| | 1 సం॥ | ½ సం॥ | ¼ సం॥ |
|---|---|---|---|
| 1 కాలము. | రు. 60 | రు. 40 | రు. 24 |
| ½ ,, | ,, 40 | ,, 24 | ,, 16 |
| ¼ ,, | ,, 24 | ,, 16 | ,, 12 |

ప్రకటన ద్రవ్యము ముందుగానె చెల్లింపవలెను.

## విజ్ఞప్తి.

ధర్మసాధనికి చందాదారులుగ నుండగలరని తమకు తోచిన వారి విలాసముల తెలుప పత్రికాధిపతిని వేడుచున్నాను. లేఖ వ్రాయుటకు ముందు మా వెల పత్రికను తెప్పించి చూడవలెను. ధ. సం.




## ఫౌంటెన్ కలము.

1. ''బ్లాకు బర్డు'' ఫౌంటెన్ పేనా, 12 ct బంగారు పాళీతో  రు. 3- 0-0
2. ''హార్డు వేరు'' ,, 14 ct ,,  2- 8-0
3. ''స్వాన్'' ,, 14 ct బంగారు పాళీతో కలది. ప్రశస్తమైనది  5- 8-0
4. ''వాటరుమెన్ ఐడియల్'' ఫౌంటెన్ పేనా 14 క్యారెట్లు బంగారు పాళీ కలది, మిక్కిలి నాణ్యము  7- 0-0
5. ''ప్రిమియరు'' ,, 14 ct బంగారు పాళీతో ,,  5- 8-0

కలములు వి. పి. గా పంపబడును. వ్రాయునపుడు, సన్నపుపాళీ కావలెనో, ముదుగుపాళీ కావలెనో వ్రాయవలయును. మేము మంచి కలములను చక్కగా పరిశోధించి చూచిన పిమ్మటనే పార్శిలు ద్వారా పంపుదుము. కావున, దూరమునందున్నవారు నమ్మకము కలిగి బంగీలద్వారా వారికి కావలసిన కలములు తెప్పించుకొనవచ్చును. వలయువారు ఈక్రింది అడ్రెసుకు వ్రాసికోవలెను.

యమ్. హెచ్. రావు అండు సన్సు, తపాలాపెట్టె నెం. **29**, కాకినాడ.

**'P. SUBBAROY.**

**Ayurvedic Pharmacy,**

*Sri Venkatesa Perumal koil Sannithy,*

TANJORE.

## పి. సుబ్బరాయి.

ఆయుర్వేద ఔషధశాల,

శ్రీవెంకటేశ పెరుమాళ్ళ సన్నిధి, తంజావూరు.

### ఓడి కోలన్.

ఇది సీమనుంచి తెప్పించినది కాదు మాయొక్క ఔషధశాలయందు మాయొక్క స్వయముగాను తయారు చేయబడినది. మనసు ప్రేమను గలిగేటటువంటి సువాసనగలది దేహమునందు పూయవచ్చును, మరియు వస్త్రములకు వేయవచ్చును. దీని నుపయోగించిన వాత తలనొప్పి గుణమయ్యేది గాకుండా దేహశ్రమ పరిహారమగును చాలాసేపు వాసనయుండిన్ని నుపయోగించినవారు వాళ్ల చుట్టి సువాసన విస్తరించియుండును. సాధారణముగా నీళ్లయందు కలిపి అంగళ్లయందు అమ్ము సరకులవలె లేకుండా యిది యొక స్వయముగా వాసనగలిగినది. అంగళ్లయందు అమ్ము (ఓడి కోలన్) 10 చుక్కలను నుపయోగించిన యెడల మావల్ల తయారుచేసి అమ్ముతూవచ్చేను ఓడికోలన్ 2 బొట్లు నుపయోగించిన చాలును. ½ అవున్సు సీసాలయందు అమ్మబడును. వెల సీసా 1 కి అ. 8, వి. పి. శెలవు 1 మొదలు 6 సీసాలవరకు అ. 8 ప్రత్యేకము.

మేలయిన వాసనబిళ్ళలు — మేలయిన గులాబి, మేలయిన మోతియా, మేలయిన లవండర్ ఇత్యాదులతో చేయబడినది. వస్త్రములకు నుపయోగించతగిన మంచి వాసనగల బిళ్ళ డబ్బి 1 కి అణాలు 8, వి. పి. శెలవు 1 మొదలు 6 డబ్బీలవరకు అణాలు 8 ప్రత్యేకము.

### బొల్లికి మందు.

పైన పూయవలసినది. ఒక వారము వాడిన తప్పక గుణమిచ్చును. మంటయుండదు. మెల్లగా పనిచేయును. అన్ని తత్వములకు సరిపడును. ఒక సీసా ఖరీదు రు 2—0—0. 1 మొదలు 3 సీసాలవరకు వి. పి. చార్జి 8 అణాలు అధికము. మావద్ద దొరకు ఆయుర్వేద ఔషధముల యొక్క కేటలాగు కోరువారికి ఉచితముగా పంపబడును.

# అమృతాంజనము.

## సుందరమైన 1921 ఉపయోగమైన క్రొత్తక్యాలండరు

విక్రియమునకు సిద్ధముగనున్నది.

క్యాలండరు వెల 1 కి 0=4=0 వి. పి. ఖర్చులు సహా 0=6=0

వెంటనే వ్రాసుకొనవలయును.

| తామర తైలము | పండ్లపొడి | మోహినీ తైలము |
| --- | --- | --- |
| డబ్బి 1 కి, 0=6=0 | డబ్బి 1 కి, 0=2=0 | సీసా 1 కి, 0=12=0 |

## అమృతాంజనము

అన్ని నొప్పులకు దివ్యామృతము.

దగ్గు, శైత్యము, పడిశము, రొమ్ము పడిశము, తలనొప్పి, వాయువు నొప్పులు, పోట్లు, జెణుకులు, బిళ్లలు, మొదలగు నొప్పులకు దివ్యామృతము.

చక్కని డబ్బితో సహా వెల రూ. 0-10-0. డజను 1 కి రూ. 6-0-0 పోస్టు ఖర్చులు వేఱు.

## అమృతాంజనము డిపో,

౧౦౯, ఫ్రిరిరోడ్డు, ఫోర్టు, బొంబాయి, ౬, తంబుశెట్టివీధి, మదార్సు.

## వైద్యరత్న పండిత డి. గోపాలాచార్యులుగారి

### జీవామృతము.

రక్తమును వృద్ధిజేయును. మేహవాత నొప్పులను బోగొట్టును. అన్నివిధములగు బలహీనములను అణచును. పాండురోగులను మంచిది. గుండెదడను నివారణజేయును. గర్భకోశరోగములను దరుమును. బాలెంతపు స్త్రీలకు సుత్తమము. చనుబాలను వృద్ధిపరచును. మూర్ఛలకు మంచిది. మెదడును బలమును గలుగ జేయును. నరములకు శక్తిని హెచ్చించును. విద్యార్థులకు ప్రాణమిత్రము. ప్రాణ శక్తిని హెచ్చించును. క్షయరోగులకు మిగుల మంచిది. కాసరోగులకు అమృతము. గుండెకాయకు మిక్కిలి బలము నిచ్చును. ఊపిరి తిత్తులకు అధికబలము జేయును. ఉబ్బసరోగులకు మిగుల హితము.

వెల బుడ్డి 1-కి రు 3—4—0. ప్యాకింగు పోస్టేజి ప్రత్యేకము. క్యాటలాగు ఉచితము.

తంతి విలాసము. పండిత్ మదరాసు.

ఆయుర్వేదాశ్రమం, 41, ఆచార్యప్ప వీధి, జి. టి. మదరాసు.



Reg. No. M. 1094.
The Dharma Sadhani, Cocanada.

Printed & Published at the Dharma Sadhani Press Cocanada, by the Editor, K. Hanumanta Rao.


To M. R. Ry. V. P. Rs. As.

16 Jayanti Gaganna garu B. A., L. T.,
Head Master, V. H. School,